# విద్యార్థులు కష్టపడి చదవాలి

భానుపురి /కోదాడ

విద్యార్థులు లక్ష్యంతో చదివి ఉన్నత శిఖరాలను అధిరోహించాలని సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సూచించారు. మంగళవారం ఆయన కోదాడ పట్టణంలో ఆకస్మికంగా పర్యటించారు. ఈ సందర్భంగా స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి, విద్యార్థుల విద్యా ప్రమాణాలను పరిశీలించారు. క్లాస్ రూమ్ లోకి వెళ్లి విద్యార్థులతో కాసేపు ముచ్చటించారు. వారితో కలిసి బెంచీపై కూర్చుని పాఠ్యాంశాల గురించి అడిగి తెలుసు కున్నారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుకోవాలని, ప్రభుత్వం కల్పిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని, వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు.



### డబుల్ బెడ్రూం ఇండ్ల తనిఖీ

అనంతరం కోదాడ పట్టణంలోని బాలాజీ నగర్ లో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇండ్లను కలెక్టర్ పరిశీలించారు. ఇళ్ల నిర్మాణ పనులు, డ్రైనేజీ, విద్యుత్, తాగునీరు వంటి మౌలిక సదుపాయాల కల్పనపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. లబ్ధిదారులకు ఇళ్లను అప్పగించే ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. పెండింగ్‌లో ఉన్న చిన్నపాటి పనులను వెంటనే పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో సూర్య నారాయణ, తాసి ల్దార్ సంతోష్ కిరణ్, హౌసింగ్ ఏఈ జెఎస్ఎన్ మూర్తి తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా రాచూరి జన్మదిన వేడుకలు



భానుపురి/ వనపర్తి

వనపర్తి జిల్లా శ్రీ వాసవి సేవాసమితి సభ్యులు రాచూరి నరసింహస్వామి జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి శ్రీ వాసవి సేవాసమితి జాతీయ అధ్యక్షుడు పూరి సురేష్ శెట్టి ముఖ్య అతిథిగా పాల్గొని శాలువాతో సన్మానించి కేకు తినిపించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీ వాసవి సేవా సమితి రాష్ట్ర నాయకులు జిల్లా నాయకులు పాల్గొన్నారు.

# సూర్యాపేటకు రైల్వే వచ్చేదాకా ఉద్యమం ఆగదని ఏకగ్రీవ సంకల్పం

భానుపురి/సూర్యాపేట టౌన్

సూర్యాపేటకు రైల్వే సాధించడమే ఏకైక లక్ష్యంగా పనిచేస్తామని సూర్యాపేట రైల్వే సాధన సమితి ఉద్యమ నిర్వహణ కమిటీ సభ్యులు మంగళవారం ప్రతిజ్ఞ చేశారు. సమితి కార్యాలయంలో జరిగిన సమావేశంలో 32 మంది సభ్యులతో ఏర్పాటైన ఉద్యమ నిర్వహణ కమిటీ త్రికరణశుద్ధితో, రాజకీయాలకు అతీతంగా ప్రజా ఉద్యమాన్ని నిర్మిస్తూ రైల్వే సాధన కోసం నిరంతరం కృషి చేస్తామని ప్రమాణ స్వీకారం చేసింది. సూర్యాపేట వంటి ప్రధాన జిల్లా కేంద్రానికి ఇప్పటికీ రైల్వే సౌకర్యం లేకపోవడం అత్యంత విచారకరమని సమావేశంలో పలువురు ఆవేదన వ్యక్తం చేశారు. రైల్వే లైన్ సాధనలో రాజకీయ భేదాలకు తావులేకుండా అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాలు, యువత, మేధావులు, వ్యాపార వర్గాలు, అన్ని సామాజిక వర్గాలను కలుపుకొని బలమైన ప్రజా ఉద్యమాన్ని నిర్మించాలని నిర్ణయించారు. సూర్యాపేటకు బుల్లెట్ ట్రైన్ అయినా, హైస్పీడ్ ట్రైన్ అయినా, సాధారణ రైల్వే లైన్ అయినా త్వరితగతిన మంజూరు అయ్యేలా ఉద్యమాన్ని దశలవారీగా ఉధృతం చేయాలని తీర్మానించారు. శాంతియుత ప్రజాస్వామ్య పద్ధతుల్లో ప్రభుత్వాన్ని మేల్కొలిపేలా మహాజర్లు, వినతిపత్రాలు, సంతకాల సేకరణ, ప్రజా చైతన్య కార్యక్రమాలు, సమావేశాలు, ర్యాలీలు తదితర కార్యక్రమాలను నిరంతరం నిర్వహిస్తూ ఉద్యమాన్ని మరింత విస్తరించాలని ఏకగ్రీవంగా నిర్ణయించారు.. సమితి కన్వీనర్ దేగల జనార్ధన్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో డాక్టర్ వి. రామమూర్తి, డాక్టర్ కే. రంగారెడ్డి, సూర్యాపేట బార్ అసోసియేషన్ అధ్యక్షుడు నూకల సుదర్శన్ రెడ్డి, కార్యదర్శి తలమల్ల హసేన్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు చింతలపాటి చిన్న శ్రీరాములు, రైల్వే సాధన సమితి కో-కన్వీనర్లు రాచూరి ప్రతాప్, డాక్టర్ ఏ. రమేష్ చంద్ర, గౌరవ సలహాదారు లింగంపల్లి భద్రయ్య, తీకుల్లా సాయి రెడ్డి, బొమ్మిడి లక్ష్మీనారాయణ, అంతటి విజయ్ కుమార్, కోఆర్డినేటర్ బిక్కుమల్ల ఉపేందర్, కే. సిద్ధారెడ్డి, సముద్రాల రాంబాబు, నల్లపాటి అప్పారావు, మతకాల చలపతిరావు, పోతరాజు నరసయ్య, యామా ప్రభాకర్, యాతాకుల రాజన్న మాదిగ, మామిడి అంజయ్య, కే. మంజుల, ముస్లిం మత పెద్ద ఖలీల్ అహ్మద్, గంధమల్ల శ్రీను, మారోజు కృష్ణమూర్తి, ఆర్. నరేందర్, కార్యాలయ కార్యదర్శి అక్కినేపల్లి రాము తదితరులు పాల్గొన్నారు. సమావేశంలో పాల్గొన్న వారందరూ ఉద్యమాన్ని బాధ్యతాయుతంగా, దీర్ఘకాలిక ప్రణాళికతో ముందుకు తీసుకెళ్లే అంశాలపై విస్తృతంగా చర్చించి పలు కార్యాచరణ నిర్ణయాలు తీసుకున్నారు.

### రైల్వే ఉద్యమానికి రూ.30 వేల విరాళం ప్రకటించిన అంతటి విజయ్

సూర్యాపేట రైల్వే సాధన ఉద్యమానికి ప్రముఖ జువెలరీ వ్యాపారి అంతటి విజయ్ కుమార్ తన వంతు సామాజిక బాధ్యతగా రూ.30 వేల ఆర్థిక విరాళాన్ని ప్రకటించారు. రైల్వే సాధన కోసం జరుగుతున్న ప్రజా ఉద్యమానికి ఆర్థికంగా అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ ఈ విరాళాన్ని అందజేశారు. ఆయన చేసిన ఈ సహకారం ఉద్యమానికి ఆర్థిక దన్ను మాత్రమే కాకుండా, సమాజంలోని ఇతర దాతలకు కూడా స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని సమావేశంలో పలువురు అభిప్రాయపడ్డారు. ఉద్యమ లక్ష్య సాధన వరకు ప్రజల సహకారంతో పోరాటాన్ని మరింత బలోపేతం చేస్తామని సమితి నాయకులు స్పష్టం చేశారు.




# బాధితులకు తను అనునిత్యం అందుబాటులో ఉంటూ వారి సాధక బాధకాలను పరిష్కరించడానికి నా వంతు వంతు కృషి చేస్తా

-అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ బాలకృష్ణ

భానుపురి/హుజూర్ నగర్

తనను ఎంతో నమ్మకం తో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ గా నియమించిన తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ నమ్మకాన్ని వమ్ము చేయకుండా ఆ పదవికి వన్నె తెస్తానని హుజూర్ నగర్ సీనియర్ సివిల్ జడ్జి కోర్టు అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కుక్కడపు బాలకృష్ణ హామీ ఇచ్చారు. మంగళవారం స్థానిక బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయనకు ఘనంగా జరిగిన సన్మాన కార్యక్రమం లో న్యాయవాదుల ఉద్దేశించి మాట్లాడారు. బాధితుల పక్షాన న్యాయస్థానంలో తన వాదనలను వినిపించి బాధితులకు న్యాయం చేకూర్చే విధంగా కోర్టుల పట్ల ప్రజలకున్న నమ్మకాన్ని బలపరచడానికి ప్రయత్నిస్తానని ఆయన పేర్కొన్నారు. బాధితులకు తను అనునిత్యం అందుబాటులో ఉంటూ వారి సాధక బాధకాలను పరిష్కరించడానికి తన వంతు కృషి చేస్తానని ఆయన తెలిపారు. తన నియమాకానికి సహకరించిన రాష్ట్ర మంత్రివర్యులు కెప్టెన్ నలమాధ ఉత్తమ్ కుమార్ రెడ్డి, తెలంగాణ రాష్ట్ర బార్ కౌన్సిల్ సభ్యులు సాముల రామిరెడ్డి, హుజూర్ నగర్ బార్ అసోసియేషన్ అధ్యక్షులు నారపరాజు శ్రీనివాసరావు లకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో సీనియర్, జూనియర్, మహిళా న్యాయవాదులు ఆయనను శాలువాలు, పూలదండలు, బొకేలతో ఘనంగా సత్కరించి మిఠాయిలు పంచిపెట్టారు. పలువురు న్యాయవాదులు ఆయనను అభినందిస్తూ శుభాకాంక్షలు తెలియజేశారు. అంతకుమునుపు ఆయన సీనియర్ సివిల్ జడ్జి నక్కా శ్యామ్ సుందర్ ను తన చాంబర్ లో మర్యాదపూర్వకంగా కలిసి ఆయనను శాలువా పూలదండలు బొకేలతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు నారపరాజు శ్రీనివాసరావు, ఆర్ వి రమణారెడ్డి, న్యాయవాదులు కాల్వ శ్రీనివాసరావు, మాధవరెడ్డి, నాగేష్, యాదగిరి, అంజయ్య, శంకర్, శ్రీను, ప్రదీప్తి, సంధ్య, షమీనా, శృతి, పలువురు సీనియర్ జూనియర్ న్యాయవాదులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# రాష్ట్రస్థాయికి ఎంపిక

భానుపురి/ జనగామ



జనగామ జిల్లా కేంద్రంలోని తెలంగాణ మైనారిటీ రెసిడెన్షియల్ జూనియర్ కళాశాల విద్యార్థి ఎస్.కె అజీమ్ రాష్ట్ర స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ P. అనిల్ బాబు తెలిపారు. జిల్లా కేంద్రంలో మంగళవారం నిర్వహించిన జావలిన్ త్రో పోటీలో మొదటి స్థానంలో నిలిచారని తెలిపారు. జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి డాక్టర్ మురళీధర్ రావు, కళాశాల పి. డి. J. రాజు , అధ్యాపక బృందం విద్యార్థిని అభినందించారు.